TGTEL/26/A5513

వార్తా దీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 58 | 27 మంగళవారం అక్టోబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

హైదరాబాద్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసు:

ఐదు నెలల తర్వాత నేపాలీ ముఠా అరెస్ట్

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసులో పురోగతి ఇంట్లో పనిచేసే యువతి సహా నలుగురు నేపాలీ నిందితుల అరెస్ట్‌తోపాటు మరో ఇద్దరి అదుపులోకి తీసుకోవడంతో మహిళను ఊపిరాడకుండా చేసి హత్య చేసిన ముఠాపనిమనిషి ధర్మ అలియాస్ కల్పనానే కీలక సూత్రధారిగా గుర్తించిన పోలీసులుదేశవ్యాప్తంగా, నేపాల్ సరిహద్దుల్లో ఐదు నెలలు గాలించి నిందితులను పట్టుకున్న సిట్‌హైదరాబాద్ నగరంలో తీవ్ర సంచలనం సృష్టించిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రే వినయ్ రంజన్ భార్య తనుజా రంజన్ హత్య కేసులో ఐదు నెలల తర్వాత కీలక పురోగతి లభించింది.





బీఆర్ఎస్ సత్యదూరమైన ఆరోపణలు చేస్తోంది: ఎంపీ చామల

- రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందని చామల ఆరోపణ
- రాష్ట్ర ప్రజలపై బీఆర్ఎస్ నేతలకు ప్రేమ లేదని విమర్శ
- ఎల్ నినో ప్రభావంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం

290 కోట్లు దాటిన మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు..

రేవంత్ రెడ్డి స్పందన

- మహాలక్ష్మి పథకంతో మహిళలకు రూ.10,000 కోట్ల ఆదా
- రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు వినియోగించుకుంటున్న పథకం
- ఈ పథకం మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అన్న సీఎం



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ఓ కీలక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు ఇప్పటివరకు ఏకంగా రూ.10,000 కోట్లకు పైగా ఆదా చేసుకున్నారని టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. పథకం ప్రారంభమైన నాటి నుంచి సుమారు 28 నెలల్లో 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని తెలిపింది.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. దీనివల్ల టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా 40 శాతం నుంచి 67 శాతానికి పైగా పెరిగింది. మహిళల నుంచి వస్తున్న భారీ స్పందనతో మొత్తం ఆక్యుపెన్సీ రేటు కూడా 69 శాతం నుంచి 98 శాతానికి చేరడం విశేషం. తాము అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఈ పథకాన్ని ప్రారంభించామని ప్రభుత్వం పలు సందర్భాల్లో గుర్తుచేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ... మహాలక్ష్మి పథకం కేవలం ఉచిత ప్రయాణం మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మహిళలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గిందని, వారు విద్య, ఉపాధి, ఇతర అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించగలుగుతున్నారని తెలిపారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా మరిన్ని బస్సు సర్వీసులను నడిపేందుకు టీజీఎస్ఆర్టీసీ చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు..

తీవ్రంగా స్పందించిన రాంచందర్ రావు

- ప్రధాని తండ్రిని ఉద్దేశించి ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు
- తీవ్రంగా ఖండించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు
- అధికారానికి దూరమవడంతో కాంగ్రెస్‌లో అసహనం అని వ్యాఖ్య



ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అంతటి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత ఇంత దిగజారుడు భాష మాట్లాడటం అత్యంత విచారకరమని అన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు... గత పన్నెండున్నర ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ నేతల్లో తీవ్రమైన అసహనం కనిపిస్తోందని విమర్శించారు. ఆ నిరాశా నిస్పృహల నుంచే మోదీ తండ్రిని కూడా నిందిస్తూ ఖర్గే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఖర్గే మాట్లాడిన సభలో వేదికపై ఉన్న నేతల కంటే కింద ఉన్న ప్రేక్షకులు చాలా తక్కువగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీహార్‌లోని పాట్నాలో నిన్న జరిగిన ఓ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తుండగా... ఓ వ్యక్తి మోదీ ఓడిపోరంటూ నినాదాలు చేశారు. దీనికి స్పందించిన ఖర్గే.. 'మోదీ కా బాప్ భీ జాయేగా' (మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే) అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై పాట్నాలోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది.

ప్రస్తుతానికి ఇరాన్‌పై దాడి లేదు: డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

- ఇరాన్‌పై సైనిక దాడులకు తాత్కాలిక విరామం
- ఒప్పందమా, సైనిక చర్యా అనేది ఇంకా నిర్ణయించలేదన్న ట్రంప్
- మధ్యవర్తులుగా ఖతార్, పాకిస్థాన్ దౌత్య ప్రయత్నాలు
- కీలకమైన హర్మూజ్ జలసంధి వద్ద కొనసాగుతున్న ఉద్రిక్తతలు

అమెరికా–ఇరాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై తక్షణ సైనిక దాడుల విషయంలో తాత్కాలికంగా వెనక్కి తగ్గుతున్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. అయితే, ఈ వివాదాన్ని దౌత్యపరమైన ఒప్పందం ద్వారా పరిష్కరించాలా? లేక సైనిక చర్యతో ముగింపు పలకాలా? అనే అంశంపై ఇంకా ఎటువంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. దీంతో యుద్ధ మేఘాలు ప్రస్తుతానికి కొంతమేర తొలగినప్పటికీ, అటు దౌత్యపరమైన, ఇటు సైనికపరమైన అవకాశాలు రెండూ అందుబాటులోనే ఉన్నట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష చర్చలు నిలిచిపోయినప్పటికీ, ఖతార్, పాకిస్థాన్ వంటి దేశాల మధ్యవర్తిత్వంతో దౌత్యపరమైన సంప్రదింపులు సాగుతున్నట్లు ఇరాన్ వర్గాలు వెల్లడించాయి. అయితే, అమెరికా విధించిన షరతులను ఇరాన్ తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలను చల్లార్చేందుకు ఖతార్, పాకిస్థాన్ ప్రతినిధులు ఇరాన్‌లో పర్యటిస్తున్నారు.ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి వద్ద ప్రస్తుతం తీవ్ర ఉద్విగ్న పరిస్థితులు నెలకొన్నాయి.



రూ.600 కోట్లతో నా కుటుంబాన్ని అంతం చేసేందుకు కుట్ర..

సీఎం శివకుమార్‌పై కుమారస్వామి సంచలన ఆరోపణలు

- దేవెగౌడ కుటుంబాన్ని రాజకీయంగా దెబ్బతీసేందుకు రూ.600 కోట్ల డీల్ జరిగిందని ఆరోపణ
- సిద్ధరామయ్యపై జరిగిన స్టింగ్ ఆపరేషన్ కేసులో తనను ఇరికించేందుకు కుట్ర పన్నుతున్నారన్న కుమారస్వామి
- సీఎం డీకే శివకుమార్, హోంమంత్రి ప్రియాంక్ ఖర్గేలే ఈ కుట్ర వెనుక ఉన్నారని విమర్శ
- కేపీఎస్‌సీ రిక్రూట్‌మెంట్ స్కామ్‌ను కప్పిపుచ్చేందుకే దర్యాప్తును తప్పుదోవ పట్టిస్తున్నారని వ్యాఖ్య



కర్ణాటక రాజకీయాల్లో కేంద్ర మంత్రి, జేడీ(ఎస్) నేత హెచ్‌డీ కుమారస్వామి చేసిన ఆరోపణలు తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబాన్ని రాజకీయంగా దెబ్బతీసేందుకు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రూ.600 కోట్ల డీల్ కుదుర్చుకున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్యపై జరిగిన స్టింగ్ ఆపరేషన్ కేసులో తనను, తన పార్టీని ఇరికించేందుకు సీఎం శివకుమార్, హోంమంత్రి ప్రియాంక్ ఖర్గే కుట్ర పన్నుతున్నారని ఆయన మండిపడ్డారు.హసన్ జిల్లాలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో పూజలు జరిపిన అనంతరం కుమారస్వామి మీడియాతో మాట్లాడారు.

...మిగతా 2 లో...

తుమ్మిడిహెట్టిపై గుడ్‌న్యూస్...

తెలంగాణ ప్రతిపాదనకు ఫడ్నవీస్ సానుకూలం...!



- తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపుపై ఫడ్నవీస్ సానుకూలం
- 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రతిపాదన
- అధ్యయనానికి అధికారుల కమిటీ ప్రతిపాదన
- రెండు లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం
- ముంపు భూములకు పరిహారం చెల్లిస్తామని హామీ

తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల సాగునీటి కల నెరవేరే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచాలన్న తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు.

...మిగతా 2 లో...

రాహుల్ గాంధీకి కోర్టులో భారీ ఊరట...

- అమిత్ షా కేసులో కీలక తీర్పు...!

- అమిత్ షాపై వ్యాఖ్యల కేసులో రాహుల్ నిర్దోషిగా తీర్పు
- రాహుల్ వ్యాఖ్యలు పరువునష్టం కాదని కోర్టు స్పష్టీకరణ

2023లో కోర్టుకు హాజరై బెయిల్ పొందిన రాహుల్



కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కోర్టులో ఊరట లభించింది. 2018లో కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువునష్టం కేసులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. రాహుల్ చేసిన వ్యాఖ్యలు పరువునష్టం కలో అమిత్ షాపై రాహుల్ గాంధీ విమర్శలు చేశారు. బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తిపై హత్య కేసు ఆరోపణలున్నాయని పేర్కొన్నారు.

...మిగతా 2 లో...

హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర...

కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!

- నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర
- అమిత్ షా పాల్గొంటారని రామచందర్‌రావు ప్రకటన
- నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ర్యాలీ



తెలంగాణలో ఓట్ల తొలగింపు అంశంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది. నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించనున్న 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి మరుసటి రోజే హైదరాబాద్‌లో బీజేపీస్వామ్యాన్ని కాపాడండి – అరాచకాన్ని అడ్డుకోండి) నినాదంతో ఈ యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వెల్లడించారు.ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో, దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానంగా ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలిపారు.

...మిగతా 2 లో...

TGTEL/26/A5513
వార్త దీపిక

రూ.600 కోట్లతో నా కుటుంబాన్ని అంతం చేసేందుకు కుట్ర..

మొదటిపేజీ తరువాయి

"మా కుటుంబాన్ని రాజకీయంగా అంతం చేయాలని ఆదేశాలు ఇచ్చింది ప్రస్తుత ముఖ్యమంత్రే. దీనికోసం ఆయన ఎన్నో కుట్రలు పన్నారు. అందులో భాగమే ఈ రూ.600 కోట్ల సుపారీ డీల్. ఇందులో ఎలాంటి సందేహం లేదు" అని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.సిద్ధరామయ్యపై జరిగిన స్టింగ్ ఆపరేషన్‌లో తమకు ఎలాంటి సంబంధం లేదని నిందితులే స్పష్టంగా చెప్పినప్పటికీ, దర్యాప్తును ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తనవైపు మళ్లిస్తోందని కుమారస్వామి ఆరోపించారు. కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ (కేపీఎస్‌సీ) రిక్రూట్‌మెంట్ స్కామ్‌ను కప్పిపుచ్చుకోవడానికే ఈ కేసును వాడుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. స్టింగ్ ఆపరేషన్ దర్యాప్తు 80 శాతం పూర్తయిందని హోంమంత్రి చెప్పడంపై స్పందిస్తూ.. "స్టింగ్ దర్యాప్తు 80 శాతం పూర్తయితే, కేపీఎస్‌సీ స్కామ్ కప్పిపుచ్చడం 90 శాతం పూర్తయింది" అని ఎద్దేవా చేశారు.ఈ స్టింగ్ ఆపరేషన్ వెనుక జర్నలిస్ట్ రాకేశ్ శెట్టి, కాంగ్రెస్ నాయకురాలు కృపా ఆల్వ ఉన్నారని సిద్ధరామయ్య, ఆయన కుమారుడు యతీంద్ర స్వయంగా చెప్పారని కుమారస్వామి గుర్తుచేశారు. అయినా, శివకుమార్, ఖర్గే ఆ కేసును తమపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్ర ఎంతలా ఉందంటే, కాంగ్రెస్ నేత సిద్ధరామయ్యకే దర్యాప్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.వాస్తవానికి 2023లో జరిగిన ఈ స్టింగ్ ఆపరేషన్ వెనుక కాంగ్రెస్ అంతర్గత కుట్ర ఉందని కుమారస్వామి అనుమానం వ్యక్తం చేశారు. సిద్ధరామయ్యను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించేందుకే ఈ స్టింగ్ ఆపరేషన్‌ను ఒక సాధనంగా వాడుకున్నారని, ఈ విషయం శివకుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలకు ముందే తెలుసని ఆరోపించారు. ఈ కుట్రను ఎదుర్కొనే శక్తి తమకుందని, దీన్ని ఇంతటితో వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేసును కప్పిపుచ్చే ప్రయత్నాలు కొనసాగిస్తే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కుమారస్వామి చేసిన ఈ తీవ్ర ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

బీఆర్ఎస్ సత్యదూరమైన ఆరోపణలు చేస్తోంది: ఎంపీ చామల

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో నెలకొన్న కరవు పరిస్థి తులపై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కేవ లం రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నేతలు సత్యదూరమైన విమర్శలు చేస్తున్నారని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరో పించారు. రాష్ట్ర ప్రజలపై బీఆర్ఎస్ నేతలకు ప్రేమ లేదని, కేవలం రాజ కీయాలే వారికి ముఖ్యమని ఆయన విమర్శించారు.ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కరవు రావాలని బీఆర్ఎస్ నేతలు కోరుకుంటున్నారని, అందుకోసం ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంగితం లేకుండా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.మరోవైపు, రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 28వ తేదీన అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఈ భేటీ జరగనుంది. కరవు నివారణ చర్యలపై అన్ని పార్టీల నుంచి సూచనలు స్వీకరించనున్నారు.రాష్ట్రంలో ఈ ఏడాది సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. ప్రాథమిక అంచనాల ప్రకారం దాదాపు 358 మండలాల్లో కరువు ఛాయలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నెలాఖరులోగా కరవు మండలాలను అధికారికంగా ప్రకటించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర...

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామచందర్‌రావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి తనతో కలిసి రావాలని, అక్కడ ఓటర్ల జాబితా నుంచి ఎన్ని పేర్లు తొలగించారో పరిశీలిద్దామని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆధారాలున్న కనీసం పది మంది ఓటర్ల వివరాలను చూపించాలని తెలంగాణ కాంగ్రెస్ మంత్రులను కోరారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను మళ్లీ చేర్చుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఎస్ఐఆర్‌లో 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారన్న ప్రతిపక్ష వాదనలో వాస్తవాలను పరిశీలించాలని రామచందర్‌రావు అన్నారు. ఆ సంఖ్యలో మరణించినవారు, చిరునామా మారినవారు, అందుబాటులో లేనివారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్నవారు ఉన్నారని పేర్కొన్నారు.నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణలపై భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఓటర్ల జాబితాల సవరణపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, బీజేపీ ఆ ఆరోపణలను ఖండిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు పార్టీల కార్యక్రమాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రామచందర్‌రావు తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరతను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లడంపై కూడా విమర్శలు చేశారు. రాష్ట్రంలోని 600కు పైగా మండలాల్లో 300కుపైగా మండలాలు కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, హైదరాబాద్‌లో రోజుకు సుమారు 8,000 వాటర్ ట్యాంకర్లకు బుకింగ్‌లు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

రాహుల్ గాంధీకి కోర్టులో భారీ ఊరట...

మొదటిపేజీ తరువాయి

ఈ వ్యాఖ్యలు అమిత్ షా ప్రతిష్ఠకు భంగం కలిగించాయని ఆరోపిస్తూ బీజేపీ నేత విజయ్ మిశ్రా అదే ఏడాది ఆగస్టు 4న సుల్తాన్‌పుర్ కోర్టులో ఫిర్యాదు చేశారు. దీంతో రాహుల్‌పై క్రిమినల్ పరువునష్టం కేసు నమోదైంది. ఐదేళ్లకు పైగా సాగిన న్యాయపోరాటం ఈ కేసులో విచారణకు హాజరు కావాలని 2023లో కోర్టు రాహుల్‌ను ఆదేశించింది. అనంతరం ఆయన కోర్టుకు హాజరై బెయిల్ పొందారు. రాహుల్ ప్రసంగానికి సంబంధించిన వాయిస్ నమూనాను పోల్చాలని ఫిర్యాదుదారు కోరినా, దిగువ కోర్టు ఆ అభ్యర్థనను తిరస్కరించింది. ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ చేసిన పిటిషన్లను కూడా పైకోర్టులు కొట్టివేశాయి. తాజాగా తుది తీర్పు వెలువరిస్తూ రాహుల్ వ్యాఖ్యలు పరువునష్టం పరిధిలోకి రావని కోర్టు పేర్కొంది.

బుగులోని జాతరకు ఏర్పాట్లు చేయండి.ఎమ్మెల్యే గండ్ర.

జయశంకర్ భూపాలపల్లి.వార్త దిపీక, అక్టోబర్ 26:

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి బుగులోని జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి దేవాదాయ, పంచాయతి రాజ్, విద్యుత్తు, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యుఎస్, వైద్య, రవాణా, పోలీస్, అగ్నిమాపక, అటవీశాఖ ల అధికారులతో జాతర ఏర్పాట్లు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

నవంబర్ 23 నుంచి 27 వరకు నిర్వహించనున్న జాతర మహోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. జాతర నిర్వహణకు సమయం తక్కువగా ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. గతంలో మంజూరైన కోనేరు బావి, శాశ్వత కల్యాణ మండపం నిర్మాణం, విద్యుత్తు లైట్లు, పైప్‌లైన్, మెట్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా 8.75 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. జాతరకు వచ్చే రహదారులను మరమ్మతు చేసి భక్తుల రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దాలన్నారు.జాతర ప్రాంతంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి అటవీ శాఖ అనుమతుల కోసం అవసరమైన ప్రతిపాదనలను ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. రూ.4 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు అవసరమైన 2.5 ఎకరాల అటవీ భూమిని రెవెన్యూ భూమితో మార్పిడి చేసి కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని, అటవీ భూముల మళ్లింపునకు సంబంధించిన త్రీడీ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా వారం రోజుల్లోగా చర్యలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు కొండపైకి వెళ్ళడానికి అనువుగా వెదురు తడికలతో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. మన జిల్లాతో పాటు ఇతర జిల్లాలు నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ



అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నిరంతర తాగునీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, బోర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ పథకాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ వంటి పనులను ముందస్తుగానే చేపట్టాలని తెలిపారు. జాతర సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా అవసరమైన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్ సరఫరా అందించాలన్నారు.జాతర ప్రాంతానికి చేరుకునే మార్గాల్లో రహదారుల మరమ్మతులు, భక్తుల రాకపోకలకు అవసరమైన ఏర్పాట్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి శాఖకు నిర్దిష్ట బాధ్యతలు కేటాయించుకుని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమష్టి కృషితో బిగులోని జాతర మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ లో భాగంగా ఆర్టీసీ, పోలీస్, దేవాదాయశాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి స్టాళ్లు ఏర్పాట్లుకు మార్కింగ్ ఇవ్వాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి కిష్టా గౌడ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, దేవాలయ ఈఓ శ్రీనివాస్, పంచాయతి రాజ్, విద్యుత్తు, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యుఎస్, వైద్య, రవాణా, పోలీస్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మిడిహెట్టిపై గుడ్‌న్యూస్...

మొదటిపేజీ తరువాయి

ఎత్తు పెంపుతో మహారాష్ట్రకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండకూడదని స్పష్టం చేస్తూనే.. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. అయితే, బ్యారేజీ ఎత్తు పెంపుపై తుది నిర్ణయం తీసుకునే ముందు అన్ని అంశాలపై సమగ్ర అధ్యయనం చేయాల్సి ఉందని అన్నారు. ముంబైలోని సహ్యాద్రి రాష్ట్ర అతిథిగృహంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం ఫడ్నవీస్‌తో సోమవారం సమావేశమైంది. నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. గతంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం బ్యారేజీ ఎత్తు 148 మీటర్లుగా ఉంది. అయితే, ఆ ఎత్తుతో ఆశించిన స్థాయిలో నీటిని తరలించడం సాధ్యం కాదని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. అందుకే 152 మీటర్లకు పెంచాలని కోరుతోంది.అధ్యయనానికి అధికారుల కమిటీ బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలు, పరిహారం వంటి అంశాలపై రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలపైనా అధ్యయనం చేయాలని సూచించారు. కేంద్ర జల సంఘం కూడా తన పరిధిలో సాంకేతిక అంశాలను పరిశీలించనుంది. రెండు లక్షల ఎకరాలకు సాగునీరు తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. గిరిజన, అటవీ ప్రాంతాల్లో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్టు కీలకమని రేవంత్‌రెడ్డి వివరించారు. బ్యారేజీ వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు అక్కడి నిబంధనల ప్రకారం పూర్తి పరిహారం చెల్లిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. బ్యారేజీ ఎత్తు ఖరారైతే తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించే మార్గం రూపకల్పన, భూసేకరణ వంటి పనులను వేగవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. చర్చలు సానుకూలంగా సాగినా.. నిర్మాణానికి తుది అనుమతి లభించిందని ఇప్పుడే చెప్పలేం. అధికారుల అధ్యయనం, తదుపరి చర్చల తర్వాతే దీనిపై స్పష్టత రానుంది.

ప్రతి ఉద్యోగి ప్రమాణ యాప్ లో వివరాలు నమోదు చేయాలి.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.

జయశంకర్ భూపాలపల్లి.వార్త దిపీక,

అక్టోబర్ 26:



జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా మీ ప్రమాణం యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ముగిసిన అనంతరం మీ ప్రమాణం యాప్‌లో నమోదుపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు కేవల ం 19 శాఖల అధికారులు మాత్రమే మీ ప్రమాణం యాప్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కూడా ఎలాంటి జాప్యం చేయకుండా యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. మీ ప్రమాణం యాప్



ద్వారా హాజరు నమోదును పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. కాబట్టి జిల్లాలోని అన్ని శాఖలు ఈ ప్రక్రియను ప్రాధాన్యతగా తీసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.మీ ప్రమాణం యాప్‌కు సంబంధించి ఏవైనా సందేహాలు, సలహాలు లేదా సూచనలు ఉంటే జిల్లా నోడల్ అధికారి, ఈడీఎం శ్రీకాంత్‌ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్వో వసంత కుమారి, ఈడీఎం శ్రీకాంత్ అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలల భద్రతపై అవగాహనే రక్షణ కవచం

- పోక్సో చట్టంపై విద్యార్థులకు న్యాయ విజ్ఞానం

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 26 (వార్త దిపీక)

: బాలలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టేందుకు విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. వీణప్రణతి సూచించారు. సోమవారం పట్టణంలోని కాకతీయ కాలనీలో గల మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. పోక్సో చట్టం, మంచి స్పర్శ,చెడు స్పర్శ మధ్య తేడా, అసభ్య ప్రవర్తనను గుర్తించడం వంటి అంశాలను వివరించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు పాల్పడినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడటం శిక్షార్హమని, ఇలాంటి ఘటనలను దాచిపెట్టకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గీతా షాజు, డైరెక్టర్ షాజు థామస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కండక్టర్ ప్రవళికకు న్యాయం చేయాలి - ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

ఆసిఫాబాద్ డిపో ఎదుట ధర్నా

ఆసిఫాబాద్, అక్టోబర్ 26, (వార్త దిపీక)



కండక్టర్ ప్రవళికపై జరిగిన దాడికి నిరసనగా ఆదివారం (ఎంప్లాయిస్ యూనియన్) ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ డిపో ప్రధాన గేటు ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ, బస్సులో విధులు నిర్వహిస్తున్న మహిళా కండక్టర్ ప్రవళికను ఒక ప్రయాణికురాలు తోసివేయడం వల్ల ఆమె కిందపడి కాలుకు తీవ్ర గాయమైందన్నారు. ఇది ముమ్మాటికీ దాడేనని, విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడం చట్టరీత్యా నేరమన్నారు.మహిళా ఉద్యోగులకు కనీస భద్రత లేకపోతే ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ఇలాంటి ఘటనలను చూస్తూ ఊరుకోవద్దన్నారు. ఆర్టీసీ దీచీూ సెక్షన్ 121, 122 మరియు 133 ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.బాధితురాలు ప్రవళికకు మెరుగైన వైద్యం అందించాలని, దాడి చేసిన ప్రయాణికురాలిని వెంటనే శిక్షించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు."ఈరోజు ప్రవళికకు జరిగితే రేపు మరో ఉద్యోగికి జరుగుతుంది. కాబట్టి నిందితురాలిపై వెంటనే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. బాధితురాలికి పూర్తి వైద్య సహాయం, వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి. విధుల్లో ఉన్న ఉద్యోగులందరికీ రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో టీజీ ఆర్టీసీ ఆసిఫాబాద్ డిపో ప్రెసిడెంట్ మల్లికార్జున్, కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, సహాయ కార్యదర్శి ప్రేమల, కేజే రావు, సుప్రీత్, అత్తరోద్దీన్ తో పాటు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

TGTEL/26/A5513 వార్త దీపిక

బీజేపీ బలోపేతానికి కృషి చేస్తా..!
ప్రజాభివృద్ధే లక్ష్యం
ఈర్ల రాజు ముదిరాజ్

పటాన్ చెరు, అక్టోబర్ 26, వార్త దీపిక న్యూస్ :

నియోజకవర్గం అమీన్‌పూర్ మండల పరిధిలోని బీరంగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా నియమితులైన ఈర్ల రాజు ముదిరాజ్‌ను, కిష్టారెడ్డిపేట్‌లోని రెయిన్బో మెడోస్ కాలనీ సొసైటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ సొసైటీ నాయకులు నూతన బాధ్యతలు చేపట్టిన ఈర్ల రాజు ముదిరాజ్‌కు అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో బీరంగూడ డివిజన్‌లో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో రెయిన్బో మెడోస్ కాలనీ మాజీ అధ్యక్షులు జీవన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ అశోక్ చౌదరి, ట్రెజరర్ ఉమామహేశ్వర్, జాయింట్ సెక్రటరీ మురళి, మాజీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, బీజేపీ నాయకులు విశ్వనాథం, సృజన్ గౌడ్, అనిల్, ప్రవీణ్ కుమార్. డి అనిల్ కుమార్, వెంకటేష్, సంతోష్ కుమార్, సుధీర్, సతీష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గురునానక్ మందిర్ కమాన్ల నిర్మాణానికి భూమిపూజ

-గురునానక్ మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు -టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి





సంగారెడ్డి, అక్టోబర్ 26, వార్త దీపిక న్యూస్ :

గురునానక్ జయంతి సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పట్టణంలోని బ్రాహ్మణవాడలో రెండు కమాన్ల నిర్మాణానికి జగ్గారెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. గురునానక్ మందిర్‌కు వెళ్లే ప్రవేశ మార్గంలో ఒకటి, మందిర్‌కు సమీపంలోని భవాని మందిర్ రోడ్డులో మరొక కమాన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అనంతరం గురునానక్ మందిర్‌ను సందర్శించిన జగ్గారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర్ ప్రతినిధులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటిని త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మందిరం ప్రాంగణంలో రావిచెట్టు కింద ఉన్న నాగదేవత ఆలయాన్ని అభివృద్ధి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్‌కు జగ్గారెడ్డి సూచించారు. ప్రస్తుతం ఉన్న విగ్రహాలను యథాస్థానంలోనే ఉంచి అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిక్కు ప్రముఖులు డాక్టర్ సర్దార్ సురేందర్ గోపి సింగ్, సర్దార్ తేజేందర్ సింగ్, సర్దార్ స్వరణ్ సింగ్, సర్దార్ సత్‌పాల్ సింగ్, డాక్టర్ సర్దార్ భరత్ సింగ్, సిక్కు గురువు గురుదేవ్ సింగ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, నరేన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు చంటి ప్రభు


సంగారెడ్డి, అక్టోబర్ 26, వార్త దీపిక న్యూస్ :

మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో పట్టణంలోని మంజీరానగర్ ప్రాంతంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు శ్రీ చంటి ప్రభు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంటి ప్రభు గారు మాట్లాడుతూ మహర్షి వాల్మీకి అంటే కేవలం ఒక మహర్షి పేరు మాత్రమే కాదని, ఆయన గొప్ప ఆలోచనకు, పరివర్తనకు, స్ఫూర్తికి ప్రతీక అని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి భారతీయ సాహిత్యంలో ఆదికవిగా గౌరవిస్తామని, ఆయన రచించిన వాల్మీకి రామాయణం భారతీయ సంస్కృతి, ధర్మం, నైతిక విలువలకు గొప్ప మార్గదర్శకమని కొనియాడారు. మహర్షి వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, మనిషి గతం కంటే అతని పరివర్తన, ఆలోచనలు, ఆచరణ ఎంతో ముఖ్యమైనవని చంటి ప్రభు తెలిపారు. ముఖ్యంగా యువత మహర్షి వాల్మీకి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని విద్య, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలకు ప్రాధాన్యతనిస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఎస్సీ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ హెచ్.డి. రవి, జిల్లా ప్రొఫెషనల్ సెల్ కన్వీనర్ పతంగి సత్యనారాయణ గారు, అందోల్ అసెంబ్లీ లీగల్ సెల్ కన్వీనర్ అడ్వకేట్ కలాలి వినోద్ కుమార్ గౌడ్, మంజీరా నగర్ కాలనీ వాసులు సంఖ్యలో పాల్గొన్నారు.



మన్ కీ బాత్ సామాన్యుల విజయగాథలకు జాతీయ వేదిక





నిజామాబాద్ అక్టోబర్ 25, వార్త దీపిక ప్రతినిధి:

సామాన్యుల విజయ గాథలకు జాతీయవేదికగా "మన్ కీ బాత్" నిలుస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. ఆదివారం దేశ ప్రధాని నరేంద్రమోదీ'మన్ కీ బాత్' 139వ ఎపిసోడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...దేశ ప్రజలకు కృషి, సేవా స్ఫూర్తి, ఆవిష్కరణలు, దేశీయ ప్రతిభను దేశవ్యాప్తంగా పరిచయం చేయడం కార్యక్రమ ప్రత్యేకత అని తెలిపారు. 12 సంవత్సరాలుగా నిరంతరాయంగా కొనసాగుతున్న మన్ కీ బాత్ ప్రజలకు, ప్రధానమంత్రికి మధ్య ఒక ఆత్మీయ వారధిగా నిలిచిందన్నారు. ఈ ఎపిసోడ్ లో పంజాబ్‌లోని మాల్వా ప్రాంతంలో సహజ పత్తి సాగును ప్రోత్సహిస్తున్న 'నవ్-త్రింజన్' కార్యక్రమాన్ని ప్రధాని ప్రశంసించడం విశేషమని పేర్కొన్నారు. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులను పునరుద్ధరించడంతో పాటు, చేనేత నైపుణ్యాలను భావితరాలకు అందించడం, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలు ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయని వివరించారు. అలాగే ఉత్తరాఖండ్‌లోని హేవల్ నదిని పునరుజ్జీవింపజేయడానికి స్థానిక ప్రజలు, అధికారులు కలిసి చేపట్టిన వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, మొక్కల పెంపకం కార్యక్రమాలను ప్రధాని ప్రస్తావించడం పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో తెలియజేస్తోందన్నారు.రాబోయే దీపావళి పండుగ సందర్భంగా స్థానిక కళాకారులు, చేతివృత్తుల వారు, చిన్న వ్యాపారులు తయారు చేసిన స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రధాని ఇచ్చిన పిలుపు ప్రతి భారతీయుడు ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.'మన్ కీ బాత్' కేవలం రేడియో కార్యక్రమం మాత్రమే కాదని, దేశంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రతిభను గుర్తించి, సమాజానికి సేవ చేస్తున్న వ్యక్తులను కోట్లాది మందికి పరిచయం చేసే గొప్ప వేదిక అని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎర్రం సుధీర్, నాయకులు పవన్ ముందడ, మారావార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం తో మెలగాలి

అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...

నిజామాబాద్ అక్టోబర్ 25 వార్త దీపిక ప్రతినిధి:

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకు వెళ్లాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. శ్రీ ధన్పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కిసాన్ ఫ్యాషన్ మాల్ లో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్, ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతూ... సేవా కార్యక్రమాలు చేయడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంతమేర సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయాలన్నారు. పేదలను ఆదుకొని అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. యువత వారాంతంలో హంగు ఆర్భాటాలకు పోకుండా తోచిన విధంగా సేవ చేయాలని పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో పేరు ప్రతిష్టల తో పాటు నలుగురికి సాయం చేశామన్న తృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ధన్ పాల్ ప్రణయ్ కుమార్, డాక్టర్ వినయ్ కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వైభవంగా అనిత హై స్కూల్ 1998..99 టెన్త్ క్లాస్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం..

వార్త దీపిక గోదావరిఖని

. అనిత హై స్కూల్ 1998.. 99 టెన్త్ క్లాస్ పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఎన్టిపిసి లోని శ్రీమయి గ్రాండ్స్ ఫంక్షన్ హాల్ లో వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షత అప్పటి టెన్త్ క్లాస్ విద్యార్థి కాశీపెల్లి సతీష్ వహించగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన కళాశాల కరస్పాండెంట్ వెంకట్ రెడ్డి ఉపాధ్యాయులు సురేష్, సుధాకర్, విజయలక్ష్మి, రాములు, శంకర్, సురేందర్,సత్యనారాయణ, రామయ్య, రవి విచ్చేయగా విద్యార్థులు వారికి ఘనంగా స్వాతం పలికి వారి చేతుల మీదుగా సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో మొదటగా స్వర్గస్తులైన కళాశాల ప్రిన్సిపల్ మాధవరావు, అప్పటి టెన్త్ క్లాస్ విద్యార్థులు వి అంజయ్య, గోపుగొని శ్రీనివాస్, శంకర్, శ్రీనివాస్, మోయిన్ కు నివాళులర్పించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి అండగా ఉంటామని తెలిపి కార్యక్రమాన్ని ప్రారంభించారు కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇంత చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన 1998 .. 99 బ్యాచ్ విద్యార్థులను అభినందిస్తూ కలిసికట్టుగా ఉంటే ఏదైనా సాధించగలరని ప్రయోజకులైన విద్యార్థులను చూస్తుంటే ఆనందంగా ఉందని విద్యార్థులు ప్రయోజకులు అయినప్పుడే గురువులకు సంతోషమని చిన్నతనంలో విద్యార్థులు చేసిన సంఘటనలు గుర్తు చేస్తూ అప్పటి విద్యార్థులకు ఇప్పుడు మరింత బాధ్యతలు పెరిగాయని సమాజంలో అందరితో అనురాగంగా ఉంటూ తమ కుటుంబాలను మంచిగా చూసుకోవాలని సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలని తాము నేర్చిన క్రమశిక్షణ ఇప్పటికీ విద్యార్థుల్లో ఉన్నందుకు సంతోషపడుతూ జ్ఞానం చాలా గొప్పదని విద్యార్థులందరూ జ్ఞానవంతులైనందుకు సంతోషంగా ఉందని ఈ కార్యక్రమం మర్చిపోలేని సంతోషాన్నిస్తుందని తెలిపారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన విద్యార్థులు కంపెల్లి సతీష్, వేల్పుల రామ్మూర్తి, పెంట రవి, రమణారెడ్డి, రాజేందర్ ,అశోక్, శ్రీపతి శ్రీనివాస్,మధుకర్ రావు, బెజాడి సంపత్, సునీల్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, పవన్, రమేష్, రూపేష్, రాజ్ కుమార్,శ్యామ్ , అనిల్, శ్రీనివాస్ సుజాత, విజయ, సునీత,సుమలత, స్నేహ , నాగలత మాట్లాడుతూ గురువుల సమక్షంలో స్నేహితులందరూ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని ఒక్కొక్కరు ఒక్కొక్క రంగంలో ముందుకు వెళ్తున్నందుకు సంతోషంగా ఉందని గురువులు నేర్పిన విద్యార్థులు గాని క్రమశిక్షణగాని మా అందరికీ ఆదర్శం అని చిన్న వయసులోనే మిత్రులను కోల్పోవడం బాధాకరమైన ప్రేమతో విద్యార్థులను ప్రయోజకులు చేసిన ప్రిన్సిపాల్ మాధవరావు సార్ మన మధ్య లేకపోవడం బాధాకరమని విద్యార్థులందరూ కలిసి ఫౌండేషన్ ను స్థాపించి ఎవరికి ఏ కష్టం వచ్చినా ఒకరికి ఒకరు అండగా ఉండాలని తెలుపుతూ చిన్ననాటి జ్ఞాపకాలను తలుచుకుంటూ విద్యార్థులు అందరూ కలిసి సంతోషంగా గేమ్స్ ఆడి క్విజ్ కాంపిటేషన్ పెట్టి సరదాగా గడిపి గురువులతో కలిసి భోజనాలు చేసి గురువులను ఆప్యాయత తో సన్మానించి వారికి జ్ఞాపికలను అందజేసి వారి చేతుల మీదుగా విద్యార్థులందరికీ జ్ఞాపికలను అందజేశారు ఈ కార్యక్రమంలో 75మంది విద్యార్థులు పాల్గొన్నారు.



ANITHA HIGH SCHOOL (SSC Batch 1998-99)

TGTEL/26/A5513 వార్త దీపిక

పోక్సో చట్టం పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

-జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్

సుల్తానాబాద్ అక్టోబర్-26 వార్త దీపిక

పోక్సో చట్టం పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. సోమవారం పాన్ ఇండియా సురక్షిత్ బచపాన్ అభియాన్ కార్యక్రమం లో భాగంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పీ హైస్కూల్ బాలికల లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల ఇరవై ఆరవ తేదీ నుంచి ముప్పై ఒకటి వరకు పోక్సో చట్టం పై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పద్దెనిమిది సంవత్సరాల లోపు బాల బాలికలకు పోక్సో చట్టం వర్తిస్తుందని, చట్టంలో పొందుపరిచిన అంశాల ఆధారంగా బాల బాలికలకు రక్షణ ఉంటుందని తెలిపారు. సోషల్ మీడియా పట్ల అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల వలలో పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాలికలకు ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే మండల న్యాయ సేవాధికార సంస్థ సంప్రదించినట్లయితే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వొడ్నాల రవీందర్, ప్రధాన కార్యదర్శి అవునూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ, న్యాయవాదులు ఆకారపు సరోత్తం రెడ్డి, బొయిని భూమయ్య, సామల రాజేంద్ర ప్రసాద్, వేముల స్నేహ, స్కూల్ ప్రిన్సిపాల్ దివాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు..



పెన్ పహాడ్ మండలంలో 'బెల్టు' సామ్రాజ్యం!

- నియంత్రణ కరువై విచ్చలవిడిగా అక్రమ మద్యం అమ్మకాలు-

-బడి పరిసరాల్లోనూ జోరుగా దందా: విద్యార్థులపై తీవ్ర ప్రభావం

-వైన్ షాపుల 'సిండికేట్'.. సరఫరా కోసం ప్రత్యేక కౌంటర్లు?

-ఎక్సైజ్ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ప్రజా ఆగ్రహం

పెన్ పహాడ్, అక్టోబర్ 26 వార్త దీపిక:

మండల పరిధిలో అక్రమ మద్యం విక్రయాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ పలు గ్రామాల్లో బెల్టు షాపుల దందా విచ్చలవిడిగా కొనసాగుతుండటంపై స్థానికులు, మహిళా సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రతి పల్లెలోనూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఈ దుకాణాలు చివరకు విద్యాసంస్థలను కూడా వదలడం లేదు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల చుట్టుపక్కల ప్రాంతాల్లోనే మద్యం విక్రయాలు సాగుతున్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పవిత్రమైన విద్యా ప్రాంగణాల వద్ద ఇలాంటి వాతావరణం నెలకొనడం వల్ల విద్యార్థుల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం పడుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారం వెనుక పెద్ద ఎత్తున సిండికేట్ హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మండలంలోని కొన్ని వైన్ షాపుల యాజమాన్యాలు అంతర్గతంగా సిండికేట్‌గా ఏర్పడి, గ్రామాల్లోని బెల్టు షాపులకు నిరంతరం మద్యం సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా కౌంటర్లను నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ సమాంతర వ్యవస్థ ద్వారా రోజూ లక్షలాది రూపాయల మద్యం పల్లెలకు చేరుతోందని, యువతను ఈ వ్యసనం వైపు మళ్లిస్తూ వారి భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని స్థానికులు మండిపడుతున్నారు.మండల వ్యాప్తంగా ఇంత బహిరంగంగా దందా సాగుతున్నా, బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసే ప్రత్యేక కౌంటర్ల వ్యవహారంపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా చర్చ జరుగుతున్నా.. సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రత్యేక కౌంటర్ల ఉనికి అధికారులకు తెలిసినా, తెలియనట్లు నటిస్తున్నారని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. అధికారుల ఉదాసీనత వల్లే నిర్వాహకులు మరింతగా రెచ్చిపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వైన్ షాపుల అక్రమ సిండికేట్ వ్యవస్థను, బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసే సదరు 'స్పెషల్ కౌంటర్'ను తక్షణమే,పూర్తిగా రద్దు చేయాలని మండల ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే రంగంలోకి దిగి ఈ అక్రమ కౌంటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలని, విద్యాసంస్థల పరిసరాల్లో ఉన్న బెల్టు షాపులపై తక్షణమే దాడులు నిర్వహించి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బల్మూర్ మండల కేంద్రంలో

పత్తి చేలకు వెళ్తున్న పిల్లలకు విముక్తి

నాగర్ కర్నూల్, వార్త దీపిక

పత్తి చేలకు తరలి వెళ్తున్న బడి బయటి పిల్లల అధికారులు విముక్తి కల్పించారు. వివరాల్లోకి వెళితే బల్మూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో ఇతర ప్రాంతాల నుండి బుల్లోరా, ఆటో ,ట్రాక్టర్ , వాహనాలలో 22 మంది పిల్లలు పత్తి చేలకు వెళ్తున్న వారిని విముక్తి కల్పించడం జరిగింది. విద్యాశాఖ, పోలీస్ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్, స్వచ్ఛంద సంస్థ కోనేరు, ఆధ్వర్యంలో సంయుక్తంగా వివిధ ప్రాంతాలు లింగాల, క్యాంపు రాయవరం, దారారం, బల్మూర్, ప్రాంతాల పిల్లలను విముక్తి కల్పించి వారిని వారి వారి పాఠశాలలకు తిరిగి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మల్లేష్, పోలీస్ శాఖ పిసి ప్రసాద్, కోనేరు స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏరియా కోఆర్డినేటర్లు జాకీర్ హుస్సేన్ శ్రీనివాసులు శివుడు, సర్పంచి భర్త మహేష్ తదితరులు పాల్గొన్నారు.



'గోల్డ్ వేలం' పేరిట భారీ సైబర్ దోపిడీ!

బ్యాంకు మేనేజర్లమంటూ నకిలీ కాల్స్..


- వ్యక్తిగత వివరాలన్నీ చెప్పి నమ్మబలుకుతున్న కేటుగాళ్లు

-.స్కానర్ల ద్వారా నగదు స్వాహా!

-.మరుసటి రోజు మళ్లీ అసలు కోసం బెదిరింపులు.. అలర్ట్ అయిన బ్యాంకు అధికారులు

పెన్ పహాడ్, అక్టోబర్ 26 వార్త దీపిక

సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండలంలో మునుపెన్నడూ లేని విధంగా ఒక ఘరానా సైబర్ దోపిడీ కలకలం రేపుతోంది. వివిధ బ్యాంకుల్లో తమ కష్టార్జితమైన బంగారు నగలను కుదువ పెట్టుకుని రుణాలు పొందిన అమాయక సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. తామే స్వయంగా 'బ్యాంకు మేనేజర్లము' అంటూ నకిలీ ఫోన్ కాల్స్‌తో రంగ ప్రవేశం చేస్తున్న ఈ కేటుగాళ్లు, బాధితుల పేర్లు, వారి వ్యక్తిగత సమాచారం,లోన్ అమౌంట్ ఎంత అనే పక్కా సమాచారాన్ని పూసగుచ్చినట్లు వివరిస్తూ నిజమైన అధికారులలా నమ్మిస్తున్నారు.బాధితులు తమ మాటలను నమ్మిన వెంటనే సైబర్ ముఠా అసలు నాటకానికి తెరతీస్తోంది. "మీ గోల్డ్ లోన్ గడువు ముగిసింది.. ప్రస్తుతం మేము వేలంపాట హాల్‌లోనే ఉన్నాం.. ఇంకా కేవలం 5 నిమిషాలు మాత్రమే సమయం ఉంది. అర్జంటుగా వడ్డీ డబ్బులు కట్టకపోతే మీ బంగారం వేరే వాళ్ల పాలవుతుంది" అంటూ తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నారు. తమ బంగారం చేజారిపోతుందనే కంగారులో, కేటుగాళ్లు వాట్సాప్‌కు పంపే థర్డ్ పార్టీ క్యూఆర్ స్కానర్లకు బాధితులు నిమిషాల వ్యవధిలో వేలాది రూపాయలను బదిలీ చేస్తూ నిలువునా మునుగుతున్నారు.కేటుగాళ్ల ఆశ అంతటితో తీరడం లేదు. ఒకసారి వడ్డీ డబ్బులు ఖాతాలో పడగానే, మరుసటి రోజు మళ్లీ అదే నంబర్ నుండి ఫోన్ చేసి "వడ్డీ మాత్రమే సరిపోదు.. పూర్తి అసలు అమౌంట్ కూడా తక్షణమే పంపాలి. లేదంటే నగలు ఇవ్వడం కుదరదు" అని సరికొత్త బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో అనుమానం వచ్చి బాధితులు తీరా అసలు బ్యాంకు శాఖకు వెళ్లి విచారించగా, అక్కడ అలాంటి వేలంపాటలేవీ జరగలేదని తేలింది. తాము పంపిన డబ్బులు బ్యాంకు ఖాతాకు కాకుండా సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లాయని తెలిసి బాధితులు నెత్తి నోరూ బాదుకుంటున్నారు.ఈ ఘరానా మోసంపై పెన్ పహాడ్ మండల బ్యాంక్ అధికారులు తీవ్రంగా స్పందించారు. బ్యాంకు సిబ్బంది లేదా అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ కౌంటర్ వెలుపల, వాట్సాప్ క్యూఆర్ స్కానర్ల ద్వారా ఎలాంటి నగదు లేదా డిజిటల్ లావాదేవీలను అంగీకరించరని స్పష్టం చేశారు. మీ గోల్డ్ లోన్లకు సంబంధించిన ఎలాంటి చెల్లింపులైనా నేరుగా బ్యాంకు శాఖకు విచ్చేసి, అధికారిక కౌంటర్ నందు మాత్రమే చెల్లించి రసీదు పొందవలెనని కోరారు. ఇటువంటి అనుమానాస్పద ఫోన్ కాల్స్ వస్తే తక్షణమే స్పందించి సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930 కి సమాచారం అందించాలని ప్రజలను హెచ్చరించారు.



మార్చాల ప్రాథమిక పాఠశాలను సందర్శించిన,

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,

నాగర్ కర్నూల్, వార్త దీపిక

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని మార్చాల గ్రామంలోని, ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సందర్శించి, పాఠశాల వాతావరణాన్ని పరిశీలించి, అక్కడి విద్యా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలు తీరుపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో మొత్తం ఆరుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధతో బోధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు.ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా 54 మంది విద్యార్థులు పాఠశాలలో చేరడంతో, ప్రస్తుతం మొత్తం 106 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. అలాగే, ఈ పాఠశాలలో చదివిన ఆరుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందినట్లు వివరించారు. స్థానిక పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుండటంతో విద్యార్థులు ఇక్కడే చదువుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని, విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి అవసరమైన కూరగాయలు ఆకుకూరలను కిచెన్ గార్డెన్ ద్వారా పండించిన ఆకుకూరలను ఉపయోగిస్తున్నట్లు, దాతల సహకారంతో విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చొని చదువుకునేందుకు సహకారంతో షెడ్‌ను ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యా వాతావరణాన్ని, విద్యార్థుల అభ్యసన పురోగతిని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పరిశీలించారు.జిల్లా కలెక్టర్ వెంట సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి,, ఎమ్మార్వో ఇబ్రహీం, ఎంపీడీవో యాదయ్య, మార్చాలా పంచాయతీ సెక్రెటరీ రమేష్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. మండల స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు.



వలసకు తరలిస్తున్న చెంచుల విముక్తి కల్పించిన అధికారులు

-రాత్రి సమయంలో వలసకు వెళ్తుండగా

-అచ్చంపేట డిఎస్పి శ్రీనివాస్ కృషి వల్ల అడ్డుకట్ట

-వలస కూలీలు అధికారులకు అప్పగించిన పోలీసులు

నాగర్ కర్నూల్ వార్త దీపిక

నాగర్ కర్నూల్ జిల్లాలోని అప్పాయపల్లి పద్మన్నపల్లి చెన్నంపల్లి గ్రామలలోని చెంచులను వలసపెరుతో తరలిస్తుండగా ఆదివారం రాత్రి అచ్చంపేట డిఎస్పి శ్రీనివాస్ కృషి వల్ల వలసకు వెళ్తున్న కూలీలకు విముక్తి కల్పించారు. దాదాపు ఇప్పటివరకు 100 కుటుంబాలకు పైగా చెంచులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఇట్టి నిరుపేద కుటుంబాలు గ్రామంలో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వలస బాట పట్టారు. ఆదివారం రాత్రి నమ్మదగిన సమాచారం అచ్చంపేట డిఎస్పి శ్రీనివాస్ ఆదేశాల మేరకు లింగాల పోలీసులు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసు పోలీసు బృందంతో వెళ్లి వలస వెళ్తున్న కూలీలకు విముక్తి కల్పించి మండల ఎంపీడీవో కార్యాలయంలో రాత్రి వారికి బస చేసేందుకు షెల్టర్ కల్పించారు. సోమవారం లింగాల మండల తహసిల్దార్ బి వెంకటేష్, మండల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, కూలీలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం తీసుకువెళ్తున్న గుంపు మేస్త్రి పై అగ్రహం వ్యక్తం చేశారు . గిరిజన చెంచులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్థానికంగా ఉండండి మీకు ప్రభుత్వం ద్వారా స్థానికంగా పనులు కల్పిస్తామంటూ గిరిజనులకు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించి వారిని వారి స్వగ్రామాలకు తరలించారు. ఇకనుంచి ఎవరినైనా గిరిజన కుటుంబాలను వలస తీసుక వెళితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు విజయ, శ్రీశైలం, శ్రీరంగాపూర్ ఉపసర్పంచ్ రేన య్య , తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించిన

సిసిఎస్ సీఐ శంకర్.

నాగర్ కర్నూల్ , వార్త దీపిక

నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజల సమస్యల పరిష్కారం కొరకు 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ సీఐ శంకర్. హాజరై, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను విని అర్జీలను స్వీకరించారు.సోమవారం నిర్వహించిన ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 06 ఫిర్యాదులు నమోదయ్యాయి. భూవివాదాలకు సంబంధించిన అర్జీ: 04 న్యాయ సహాయం/ఇతర సమస్యలకు సంబంధించిన అర్జీ: 02ఈ సందర్భంగా సీఐ శంకర్ మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో అందిన అర్జీలను తక్షణమే పరిశీలించి, చట్టప్రకారం తగిన పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మార్చల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు,

-అంగన్వాడీ కేంద్రం, బాలాజీ కాటన్ మిల్లును పరిశీలించిన,

-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,

నాగర్ కర్నూల్ , వార్త దీపిక

నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి మండల పరిధిలోని మార్చల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, అంగన్వాడీ కేంద్రం, బాలాజీ కాటన్ మిల్లును జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు, అంగన్వాడీ కేంద్రం నిర్వహణ, కాటన్ మిల్లు కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు.ముందుగా మార్చల గ్రామంలో ఆవంచ వెంకటయ్యకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఇంటి నిర్మాణం పూర్తయి, లబ్ధిదారుడు అందులో నివాసం ఉంటున్న తీరును పరిశీలించారు. అనంతరం ఇంటి నిర్మాణానికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల వివరాలను వెంకటయ్యను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఇందిరమ్మ ఇంటికి సంబంధించిన బిల్లులన్నీ మంజూరయ్యాయని, ఫైనల్ బిల్లు మాత్రం ఇంకా మంజూరు కాలేదని వెంకటయ్య కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న ఫైనల్ బిల్లు మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం బిల్లుల చెల్లింపులు జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రానికి హాజరవుతున్న చిన్నారులకు అందుతున్న ఆహారం, కేంద్రం రోజువారీ నిర్వహణ, పిల్లలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమైనందున, వారికి అందించే సేవల విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రం నిర్వహణ, చిన్నారుల హాజరు తదితర అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.అనంతరం గ్రామ పరిధిలోని బాలాజీ కాటన్ మిల్లును జిల్లా కలెక్టర్ సందర్శించి, మిల్లు రోజువారీ నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. రైతుల నుంచి ప్రతిరోజూ ఎంత పరిమాణంలో పత్తిని సేకరిస్తున్నారు, సేకరించిన పత్తిని మిల్లులో ఏ విధంగా ప్రాసెస్ చేస్తున్నారు అనే అంశాలపై ఆరా తీశారు. మిల్లులో పత్తి సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్‌కు సంబంధించిన కార్యకలాపాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లు నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తూ, పత్తి సేకరణ ప్రక్రియ, రోజువారీ కార్యకలాపాలపై సంబంధిత మిల్లు యజమాని ,సిబ్బందితో చర్చించారు.



Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984